నేడు సాయి ప్రేమసుధ మందిర వార్షికోత్సవం

గురజాల: స్థానిక నగర పంచాయతిలో వేంచేసియున్న శ్రీ సాయి ప్రేమసుధ మందిరం 16వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు

గురజాల: దసరా శరన్నవరాత్రులకు దేవాలయాలు ముస్తాబయ్యాయి. 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం, పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయం, కనకదుర్గా అమ్మవారి దేవాలయం, సాయిబాబా దేవాలయాల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటుచేశారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవార్లు పలు అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవార్లు ప్రత్యేక పూజలు అందుకోనున్నట్లు ఆయా కమిటీ సభ్యులు తెలిపారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో కొలువైయున్న భగవాన్ సత్యసాయిబాబా మందిరంలో 15వ తేదీనుంచి విజయదశమి పర్వదినం పురస్కరించుకొని దేవీ నవరాత్రులు వైభవంగా నిర్వహించటం జరుగుతుందని ఆలయ అధ్యక్షుడు కొత్త నరేంద్రకుమార్ తెలిపారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీ గణపతి పూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, దీక్షాధారణ, జెండా ఆవిష్కరణ అనంతరం శ్రీ బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, షోడశపూజ, కుంకుమ అర్చన నిర్వహించటం జరుగుతుందన్నారు. అనంతరం 12 గంటలకు మహా నివేదన, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందని తెలిపారు. 16వ తేదీ అన్నపూర్ణాదేవి, 17న ధనలక్ష్మి, 18 మహంకాళి అలంకరణ, 19 మహాలక్ష్మి, 20 సరస్వతి దేవి, 21 మహిషాసురమర్ధని, 22 దుర్గా దేవి అలంకరణ, 23 రాజరాజేశ్వరి అలంకరణ, 24వ తేదీన పుష్ప శయ్య అలంకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు.



నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద సిద్ధమైన కనకదుర్గమ్మ తల్లి దేవాలయం

దాచేపల్లి: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు అయ్యాయి. దసరా పండుగ సందర్భంగా ఆదివారం నుంచి తొమ్మిదిరోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద కనకదుర్గమ్మ తల్లి దేవాలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. దాచేపల్లి, నడికుడిలతో పాటు గ్రామాల్లో ఉన్న పలు దేవాలయాలను పండుగ సందర్భంగా ముస్తాబు చేశారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ వేషధారణలతో అలంకరణ చేస్తారు.

'బంగారుతల్లి' సక్రమంగా అమలవ్వాలి

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: రాష్ట్రంలోని కిశోర బాలికలలో రక్తహీనతను నివారించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బంగారుతల్లి పథకాన్ని ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు సక్రమంగా అమలుచేయాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాయలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వేల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు బంగారు తల్లి పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కిశోర బాలికలకు రక్తహీనతను వలన వచ్చే పలు ఆరోగ్యసమస్యల పరిష్కరించేందుకు బంగారు తల్లి పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. బంగారు తల్లి కార్యక్రమం అమలులో భాగంగా పాఠశాలలలో హెచ్‌ఎంలకు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రక్తహీనత ఉన్న పిల్లలలో కనీసం హిమోగ్లోబిన్ 9 శాతానికి పెంపొందించడమే బంగారుతల్లి ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. హిమోగ్లోబిన్ ప్రోగ్రెస్ కార్డు ద్వారా కిశోర బాలికలకు చాలా ఉపయోగాలు ఉన్నాయని తద్వారా పిల్లలకు ఐరన్ సమృద్ధిగా ఉండే బెల్లంతో చేసిన పదార్థాలు, ఆకుకూరలు, పాలు, గుడ్డు వంటివి అందించాలన్నారు. డీడీఓ యార్ల మహాలక్ష్మి, ఈఓపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వేల్ఫేర్ డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

వైస్ ఎంపీపీ-2 అచ్చమ్మ రాజీనామా

రెంటచింతల: మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు-2 మాచర్ల అచ్చమ్మ తన పదవికి రాజీనామా చేశారు. మంచికల్లు ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన అచ్చమ్మ జిల్లా పరిషత్ సీఈఓ మోహన్‌రావుకు శుక్రవారం తన రాజీనామా పత్రాన్ని అందజేసినట్లు శనివారం తెలిపారు. అనారోగ్యకారణాలతో, వ్యక్తిగతంగానే రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఆమె రాజీనామాను సీఈఓ వెంటనే ఆమోదించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రెంటచింతల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ సామ్యేల్ రాజీవ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 6వ తేదీన పాలువాయి నుంచి జొన్నలగడ్డ మట్టపల్లి నరసింహరాజు(51) తన ద్విచక్రవాహనంపై రెంటచింతలకు వస్తుండగా ఓ యువకుడు ద్విచక్రవాహనంపై వేగంగా ఢీకొట్టగా నరసింహరాజు తీవ్రంగా గాయపడ్డాడు. నర్సరావుపేటలో ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.